క్లుప్తంగా

క్రీడాకారిణికి అభినందన



ఆత్మకూర్: షూటింగ్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో కాంస్య పథకం సాధించిన మండలంలోని ఆరేపల్లికి చెందిన మౌనికను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అభినందించారు. మౌనిక కీసరలోని మహాత్మజ్యోతిరావ్ పూలే గురుకులంలో ఇంటర్ సెకండియర్ చదువుతూ షూటింగ్ పోటీల్లో కాంస్య పథకం సాధించడం తమ ప్రాంతానికే గర్వకారణని కొనియాడారు. మౌనికకు రాష్ట్రప్రభుత్వం తరుపున అండగా నిలుస్తామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా రవాణా, రైఫిల్, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆరేపల్లి గ్రామస్తులు రామచంద్రయ్య, వెంకటన్న, మోహన్, బాలయ్య, రాజు, సురేష్ పాల్గొన్నారు.

‘రైతు నేస్తం’ వినియోగించుకోండి

వీపనగండ్ల: వానాకాలం సీజన్ ప్రారంభం అవ్వడంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పాన్‌గల్ ఏడీఏ డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం 10 గంటలకు మండల కేంద్రంతో పాటు గోపల్‌దిన్నె, బొల్లారం రైతువేదికలో దృశ్య, శ్రవణ పరికరాల ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు రాష్ట్రస్థాయి శాస్త్రవేత్తలు ఇస్తారని తెలిపారు. అలాగే చిన్నంబావి మండలంలోని దగడపల్లి, పెద్దమరూర్, బెక్కెం, పాన్‌గల్ మండలంలో పాన్‌గల్‌తో పాటు మల్లాయిపల్లి, దొండాయిపల్లి రైతువేదికలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

అజ్జకొల్లులో వైద్య శిబిరం



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు రైతు వేదికలో సోమవారం మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆస్పత్రి డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు గ్రామస్తులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు ఆపరేషన్లు కావాల్సిన వారికి ఎస్వీఎస్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎస్వీఎస్ ఆస్పత్రి యాజమాన్యం రామిరెడ్డి, బసవరాజ్‌లకు గ్రామస్తుల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు విజయేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రన్నగౌడ్, కాగితాల పెద్ద వెంకట్‌రెడ్డి, వడ్డె రాజు, బస్టాండ్ బాలు, హరిజన్ ఆంజనేయులు, పాతమల్లె బాలు, తెలుగు నాగన్న, గుంటుపల్లి సవరయ్య తదితరులు పాల్గొన్నారు.

పందుల బెడద నుంచి కాపాడండి

మదనాపురం: అజ్జకొల్లులో పందుల బెడద నుంచి కాపాడాలని ఆర్పీఐ మండల అధ్యక్షుడు కావలి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో అధిక సంఖ్యలో పందులను వదలడంతో ఇళ్ల పరిసరాల్లో తిరుగుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపై దాడులు సైతం చేస్తున్నాయని వాపోయారు. అదేవిధంగా పంట పొలాలను నాశనం చేస్తున్నాయని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పందుల పెంపకందారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యపై గ్రామ సభలో పలుమార్లు తీర్మానాలు చేసిన, తహసీల్దార్‌కు వినతిపత్రలు ఇచ్చినా పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పందులను గ్రామం బయటకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో యువకులు లక్ష్మణ్, బాలరాజు, శివ ఉన్నారు.

బాధితులకు పరామర్శ



వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు విష్ణుగౌడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాపన్న కొద్ది రోజుల నుంచి అనారోగ్యం బాధపడుతున్నాడు. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం ఆయా గ్రామాల్లో బాధితులను కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మాణిక్యం, రాములుయాదవ్, దిలీప్‌కుమార్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథనాయుడు, ఎద్దుల సాయి, వెంకటేష్, ధర్మనాయక్, మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము, ధర్మశాస్త్రి, బాలయ్య, సత్యంచారి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో నంబర్ 1గా నిలవాలి

వనపర్తిటౌన్: పరిశుభ్రతలో వనపర్తి పట్టణాన్ని రాష్ట్రంలోనే నంబర్ 1గా నిలిపే సామర్థ్యం కేవలం పారిశుద్ధ్య కార్మికులకే ఉందని, వారికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని 9, 10, 11, 19, 26, 28, 32వ వార్డుల్లో 100 రోజుల కార్యచరణలో భాగంగా వీధి, పెంపుడు కుక్కలపై, ఏబీసీ ప్రచారం, సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా అవగాహన, ఎస్‌హెచ్‌జీ కొత్త గ్రూప్ చేయడం, డ్రెయినేజీల్లో డెసిల్ట్, చెత్త తొలగింపు, భువన్ సర్వేలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ శంకరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, సూపర్‌వైజర్, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే వ్యాధులు దూరం

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కలిసి కట్టుగా పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, దోమల నివారణకు కృషి చేయాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కమిషనర్ చికిని శశిధర్ అన్నారు. సోమవారం 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వార్డుల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెత్తను ఆరుబయట పారవేయకుండా చెత్త డబ్బాల్లో వేసి వీధుల్లో తిరిగే చెత్త ట్రాక్టర్‌కు అందించాలని కోరారు. అనంతరం కుక్క కాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ, తదితర అంశాలపై క్లుప్తంగా కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శశిధర్



వనపర్తిలో..

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

పాన్‌గల్: డ్రగ్స్, మాదక ద్రవ్యాల నివారణ పోరాటంలో యువత భాగస్వాములు కావాలని డీవైఎఫ్ఐ నాయకులు మహేష్, బాలకృష్ణ, కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రేమద్దులలో డీవైఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని, మత్తు పదార్థాలు అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని నిరసన తెలిపారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతోనే మాదక ద్రవ్యాల సంస్కృతి పల్లెలకు పాకిందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సురేందర్, వెంకటేష్, శ్రీను, అంజి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు

మత్స్యకారులకు నగదు బదిలీ చేయాలి

వీపనగండ్ల: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి చేపపిల్లలకు బదులుగా డబ్బులను మత్స్యకారుల ఖాతాలో జమ చేయాలని గోవర్ధనగిరి గ్రామ మత్స్య సహకార సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన మత్స్య సహకార సంఘ సమావేశంలో పాల్గొన్న జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ చేపపిల్లలను వదిలేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నామని చెప్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకం చేపపిల్లలను మత్స్యకారులకు అంటగడుతున్నారని ఆరోపించారు. దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో గ్రామ సంఘం నాయకులు సురేందర్‌బాబు, ఉపాధ్యక్షుడు నాగన్న, కార్యదర్శి మహేష్, నాయకులు పడిగన్న, ఆంజనేయులు, దర్గేష్, కృష్ణయ్య, లక్ష్మయ్య, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాలయ్య

బోనస్ డబ్బులు చెల్లించాలని నిరసన



కొత్తకోటలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కొత్తకోట: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ భరత్‌భూషణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణ చౌరస్తాలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి గద్దెనెక్కిందని కాంగ్రెస్ నేడు రైతులకు మొండిచేయి చూపిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని పూర్తి నెరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి, దాబా శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి, నరసింహ, నవీన్ రెడ్డి, స్టార్ బాలు, సురేష్‌గౌడ్, రమేష్‌చారి, అమరేందర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న రకం వడ్లకు సంబంధించిన బోనస్‌ను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బస్టాండు కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి మట్లాడుతూ రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలని, బోనస్ చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బాబుగౌడ్, వడ్డె రాజు, అమర్నాథ్, తిర్మలాపల్లి కురుమన్న, బురాన్, కొండన్న, అగ్రహారం రాము, భాస్కర్, శివ, దుప్పల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో..

‘నీళ్లను తరలించుకుపోయింది నిరంజన్‌రెడ్డే’



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అమరచింత: నీళ్లను తరలించుకొనిపోయి తమ ప్రాంత రైతులకు మోసం చేసిన ఘనత మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికే దక్కుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచంద్ వర్ధంతి, విగ్రహ ఆవిష్కరణకు హాజరైన మాజీ మంత్రి సాయిచంద్ బీఆర్ఎస్‌కు చేసిన సేవలను కీర్తించకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు వేదికను ఉపయోగించుకోవడం దౌర్భాగ్యమన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి జూరాల ప్రాజెక్టు వద్ద తట్టెడు ఒండ్రుమట్టిని సైతం తొలగించని వాళ్లు కేవలం 19 నెలల కాంగ్రెస్ పాలన గురించి విమర్శలు చేయడం అవివేకమన్నారు. జూరాల క్రస్ట్‌గేట్ల రోప్‌లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే తెగిపోయాయని, కృష్ణ పుష్కరాల సమయంలో జూరాల బ్యాక్‌వాటర్‌ను గేట్ల ద్వారా ఎత్తి కిందకు వదిలే సమయంలో తెగిపడినా పట్టించుకోలేదని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి మళ్లించి, రైతులకు సాగునీటిని అందిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. జూరాల ప్రాజెక్టును సందర్శించి వాటి మరమ్మతులతో పాటు సమీపంలో వంతెన నిర్మాణానికి రూ.300 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజక వర్గ అభివృద్ధిపై ఏనాడు దృష్టి సారించని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నేడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయ్యడం తగదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు తిరుమలేష్, మహంకాళి విష్ణు, తౌఫిక్, ప్రకాశం, శ్యాం, హనుమంతునాయక్, పోసిరిగారి విష్ణు, రవికాంత్, రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ, జటప్రోల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉన్నట్లు ఏఈ అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దదగడ, జటప్రోల్ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనులు, విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. దీనికి ఆయా గ్రామాల్లోని ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయండి

పాన్‌గల్: మండల కేంద్రంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రానికి వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు డీవైఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు కమలాకర్ మాట్లాడుతూ మండలంలో గురుకుల పాఠశాలతో పాటు ఒకేషనల్ కళాశాలను ఏర్పాటు చేయాలని, పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా గదులు లేవని, మన ఊరు–మన బడి పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధిలో అసంపూర్తి పనులను పూర్తి చేయాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బాల్యనాయక్, దేవేందర్, సూర్యవంశం రాము, భీమయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు రాక ఇబ్బందుల్లో ‘108’ సిబ్బంది

కొత్తకోట రూరల్: రెండు నెలల నుంచి జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని జిల్లాలో పనిచేస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 52మంది అంబులెన్స్‌లో పనిచేస్తుండగా 26మంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఈఎంటీ), 26 మంది పైలెట్లు ఉన్నారన్నారు. స్కూల్స్ ప్రారంభమయ్యి 20రోజులు కావస్తున్నా పిల్లలకు బుక్స్, యూనిఫామ్స్, ఫీజులు కట్టకపోవడంతో పాటు కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ వెంటనే స్పందించి తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని 108 సిబ్బంది వేడుకుంటున్నారు. కార్యక్రమంలో ఈఎంటీలు ఖాజమైనొద్దీన్, రాము, జ్యోతి, రాములు, పైలెట్లు అక్బర్, చంద్రశేఖర్, రవి తదితరులు ఉన్నారు.

పోలీసు అధికారి సేవలు అభినందనీయం

వనపర్తి: ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో గడపడంతో పాటు సమాజ సేవలో పాలు పంచుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు 37 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐ వెంకటేష్‌గౌడ్ దంపతులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ సమయంలో ప్రతి ఉద్యోగికి సంతోషం, బాధ రెండూ ఉంటాయన్నారు. పదవీ విరమణ తర్వాత ఒక కొత్త జీవితం మొదలవుతుందని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవడం ద్వారా నచ్చిన రంగంలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌చార్జ్ అదనపు ఎస్పీ ఉమామహేశ్వరరావు, రిజర్వ్ సీఐ అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

వనపర్తి రూరల్: రాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా శ్రీనివాస్‌గౌడ్ పదేళ్లుగా పని చేసి సోమవారం పదవీ విరమణ చేపడుతున్న సందర్భంగా సోమవారం పాఠశాలల్లో ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మద్దిలేటి మాట్లాడుతూ శ్రీనివాస్‌గౌడ్ సేవలను కొనియాడారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ దంపతులను పూలమాల, శాలువాతో సన్మానించారు.



ఎస్ఐ వెంకటేష్‌గౌడ్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

మహిళపై దాడి: నలుగురిపై కేసు నమోదు

పాన్‌గల్: మహిళపై దాడి చేసిన ఘటనలో సోమవారం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. హెచ్‌సీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జమ్మాపూర్ గ్రామానికి చెందిన మంగళవారం నందికొండ వెంకటయ్య, నందికొండ బాలపీరు, నందికొండ శివ, శారద నలుగురు కలిసి భూమి పంపకంలో తలెత్తిన ఘర్షణలో నందికొండ చెన్నమ్మపై కుర్చీలు, కట్టెతో దాడి చేసి గాయపర్చారు. ఘటనలో చెన్నమ్మ తలకు, కుడిచేతికి బలమైన గాయాలయ్యాయి. భూమి పాలి భాగం సక్రమంగా పంపిణీ చేయమని అడిగితే దూషించి దాడిచేసి గాయపర్చిన నలుగురిపై తగు చర్యలు తీసుకోవాలని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

భూమి విషయంలో..

ఖిల్లాఘనపురం: భూమి విషయంలో తగాదా పెట్టుకుని దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన కల్వకోలు సుధాకర్‌రెడ్డి ఆదివారం తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న సమయంలో పాలివాడైన కల్వకోలు గోవర్ధన్‌రెడ్డి వచ్చి తన భూమి మీ దగ్గర ఉందని, తమకు ఇవ్వాలని గొడవ పెట్టుకున్నాడు. అసభ్యకరంగా తిట్టడంతో పాటుగా కట్టెతో కొట్టాడు. ఈ విషయమై సుధాకర్ రెడ్డి సోమవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా.. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

ఖిల్లాఘనపురం: అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. సోమవారం మండలంలోని హిర్లతండా తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలను చైతన్యం చేసేందుకు గాను ముందస్తు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా, కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారు, విద్యార్థినులకు స్కూటీలు, వృద్ధులకు రూ.నాలుగు వేల పింఛన్ తదితర హామీలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మన్యంగౌడ్, గోపాల్‌నాయక్, దేవెరశెట్టి సురేందర్, టోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కృష్ణనాయక్

వివక్ష చూపడం సరికాదు

గోపాల్‌పేట: గ్రామాల్లో ఎస్సీలను కులం పేరుతో దూషించడం, అంటరానివారిగా ప్రచారం చేయడం, టీ షాపుల వద్ద ప్రత్యేక గ్లాసుల విధానం వంటి వాటిని ప్రోత్సహిస్తే బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని గోపాల్‌పేట ఆర్ఐ యాదయ్య, ఎస్ఐ నరేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఏదుట్లలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏదుట్లలోని పెద్దలు, గ్రామస్తులతో సమావేశమై షెడ్యూల్డ్ కులాల వారికి ఉండే హక్కుల గురించి వివరించారు. దళితులను అందరిలో సమానంగా చూడాల్సిందేనని, ఎక్కడైనా వివక్ష చూపితే తమ దృష్టికి తీసుకొస్తే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా రేవల్లి మండలంలోని బండరావిపాకులలో సివిల్‌రైట్స్ డే పై ప్రజలకు అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాయిచంద్ జ్ఞాపకాలు పదిలం

అమరచింత: దివంగత సాయిచంద్ జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగా తమ మదిలో మిగిలిలాయని మాల మహానాడు మండల అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, రాంపురం రాము తెలిపారు. పట్టణంలో సాయిచంద్ విగ్రహ ఏర్పాటును పురస్కరించుకొని సోమవారం మాల మహానాడు ఆధ్వర్యంలో సాయిచంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరచింతలో పుట్టిన సాయిచంద్ తన తండ్రి వెంకట్రాములు గాత్రాన్ని పునికి పుచ్చుకొని ఎర్ర జెండా చేత పట్టి, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత నీలి జెండా భుజాన వేసుకొని బహుజనుల, దళితుల వాదాన్ని వినిపిస్తున్న సమయంలో విధి వక్రీకరించి ఆయన మనకు దూరమయ్యారన్నారని వాపోయారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్, వెంకటస్వామి,నవీన్, రవి, రమేష్, శేఖర్, భార్గవ్, అజయ్, పవన్‌కుమార్, ప్రశాంత్, రాములు, రంగన్న, నరేందర్ పాల్గొన్నారు.



సాయిచంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

అద్దె భవనాల్లో ‘అంగన్‌వాడీలు’

- అవస్థలు పడుతున్న చిన్నారులు
- అద్దె చెల్లించలేక ఇబ్బందులు



చిమనగుంటపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

వనపర్తి రూరల్: ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా చిన్నారులకు ఆటపాటలతో విద్యా బుద్ధులు నేర్పేందుకు మంజూరు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీల్లో వాటికి మౌళిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు, టీచర్లు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీలది కీలక పాత్ర. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులు ప్రీస్కూల్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

మండలాల వారీగా..

వనపర్తి మండలంలో మెత్తం 26 గ్రామ పంచాయతీల పరిధిలో 54 అంగన్‌వావాడీ కేంద్రాలు ఉండగా.. వాటిలో 12 కేందాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వాటిలో ఏడాది నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు 2,482 మంది, గర్భిణులు 1,159 మంది, బాలింతలు 173 మంది ఉన్నారు.

✦ పెబ్బేరు మండలంలో 20 గ్రామ పంచాయతీల పరిధిలో 46 కేంద్రాలు పనిచేస్తుండగా.. వాటిలో అద్దె భవనాల్లో 6 కేంద్రాలు నడుస్తున్నాయి మండల వ్యాప్తంగా ఏడాది నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు 1,798 మంది చిన్నారులు, గర్భిణులు 205 మది, బాలింతలు 202 మంది ఉన్నారు.

✦ శ్రీరంగాపురం మండలంలో 8 గ్రామ పంచాతీల్లో 21 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఒక కేంద్రం అద్దె భవణంలో కొనసాగుతుంది. మండల వ్యాప్తంగాఏడాది నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు 762 మంది చిన్నారులు, గర్భిణులు 72, బాలింతలు 48 ఉన్నారు. వీరికి నిత్యం మధ్యాహ్నం భోజనంతో పాటు గుడ్డు, పాలు, పౌష్టికాహారం అంగన్‌వాడీ నుంచి సేవలు పొందుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి

అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు సరిగా లేకపోవడంతో టీచర్లతో పాటు లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వాటికి ప్రభుత్వం నెలనెలా అద్దె రాకపోవడం, యజమానులు నిరంతరం అద్దె పెంచుతుండడంతో అవి కట్టలేక టీచర్లు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– భగవంతుయాదవ్, రంగాపురం

ప్రతిపాదనలు పంపాం

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరై వెంటనే భవన నిర్మాణం పనులు చేపడుతాం. అద్దె భవనాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనా వెంటనే యజమానుల ఖాతాల్లో జమ చేస్తాం.

– హాజీరాబేగం, ఐసీడీఎస్ సీడీపీఓ, వనపర్తి